క్లుప్తంగా

హైకోర్టు న్యాయమూర్తిని కలసిన జేసీ


హైకోర్టు న్యాయమూర్తి వి.గోపాలరావుకు పుష్పగుచ్ఛాన్ని అందిస్తున్న జేసీ డాక్టర్ నవ్య

కర్నూలు(సెంట్రల్): కర్నూలు వచ్చిన హైకోర్టు న్యాయమూర్తి వి.గోపాలరావును జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య మర్యాద పూర్వకంగా కలిశారు. ఆమె రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహంలో ఆయనను కలసి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు.

ఇళ్ల వద్దకే రేషన్ పంపిణీ 21 శాతం

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు వృద్ధుల ఇళ్లకే వెళ్లి రేషన్‌ను పంపిణీ చేస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య తెలిపారు. ప్రతి నెల 25 నుంచి 31వ తేదీ వరకు సరుకులను ఇవ్వనున్నట్లు చెప్పారు. అందులో భాగంగా జూలై మాసానికి సంబంధించి శనివారం వరకు 21 శాతం మంది (దాదాపు 10 వేల మంది) వృద్ధుల ఇళ్లకే వెళ్లి సరుకులను ఇచ్చినట్లు చెప్పారు. జిల్లాలో మొత్తం 65 ఏళ్లకు పైబడిన వృద్ధులు 46,283 మంది ఉన్నారన్నారు. కర్నూలు నగరంలోని వీకర్స్ సెక్షన్ కాలనీలో జేసీ వృద్ధులకు ఇళ్ల వద్దకు వెళ్లి రేషన్ సరుకులను అందించారు.

గడియారం ఆసుపత్రిని ప్రైవేట్‌కు అప్పగించొద్దు


మాట్లాడుతున్న ఆర్.శేఖర్

కర్నూలు(సెంట్రల్): అభివృద్ధి పేరుతో గడియారం ఆసుపత్రిని ప్రైవేట్‌కు అప్పగించాలని చూస్తే అడ్డుకుంటామని సీపీఎం నగర కార్యదర్శి ఎం.ఆర్‌శేఖర్, పార్టీ నాయకులు ఎస్ఎండీ షరీఫ్, సయ్యద్ పాషా, మహబూబ్‌బాషా ప్రభుత్వానికి అల్టిమేటం ఇచ్చారు. శనివారం ఆసుపత్రి ఎదుట వారు మాట్లాడుతూ..వందేళ్ల చరిత్ర ఉన్న గడియారం ఆసుపత్రి పాతబస్తీ పేదలకు వైద్య సేవలు అందిస్తుందన్నారు. ఈ ఆసుపత్రిని ప్రైవేట్‌కు అప్పగించేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందన్నారు. డాక్టర్లు, ఇతర వైద్య సిబ్బందిని నియమించి అభివృద్ధి చేయాల్సింది పోయి ప్రైవేట్ అప్పగించేందుకు బరి తెగించడం ఎంత వరకు సమంజసమని వారు ప్రశ్నించారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నరసింహులు

కర్నూలు(సెంట్రల్): ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఆర్.నరసింహులు, రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఎస్కే బాషాలను ఎన్నుకున్నట్లు ఆ సంఘం గౌరవాధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ, కన్వీనర్ సుధాకరప్ప తెలిపారు. శనివారం కార్మిక, కర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఇటీవల గుంటూరులో నిర్వహించిన ఏపీ భవన నిర్మాణ కార్మికసంఘం 8వ మహాసభల్లో నూతన కమిటీని ఎన్నుకున్నారన్నారు. రాష్ట్ర కమిటీలో నరసింహులు, ఎస్కే బాషాకు చోటు దక్కడం హర్షణీయమన్నారు.

సాక్షి సినిమాలు

ఎస్‌వీసీ కాంప్లెక్స్: హరి హర వీరమల్లు, సయ్యారా, ది ఫెంటాస్టిక్ ఫోర్ : ఫస్ట్ స్టెప్స్, మహావతార్ నరసింహ, జూనియర్
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్ : హరిహర వీరమల్లు, జూనియర్, మహావతార్ నరసింహ
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : సయ్యారా, హరిహర వీరమల్లు
శ్రీరామ : పోలీస్ వారి హెచ్చరిక
రాజ్ : హరిహర వీరమల్లు
భరత్ కాంప్లెక్స్ : వెంకి (2004)
విజయ : తమ్ముడు
విక్టరీ : తమ్ముడు

జీవన మార్గంలో దివిటీలు



'అమృతం తాగిన వాళ్లు దేవతలు, దేవుళ్లు.. అది కన్నబిడ్డలకు పంచిన వాళ్లు అమ్మానాన్నలు' అంటూ ఓ సినీ గేయ రచయిత తల్లిదండ్రుల గొప్పదనాన్ని ఓ పాటలో వివరిస్తారు. అమృత సమానమైన ప్రేమ, మమకారాన్ని పిల్లలకు పంచుతారు కాబట్టి వారు ప్రత్యక్ష దైవాలుగా చెప్పవచ్చు. జీవితం కష్ట సుఖాల సమ్మిళితం. అందుకే తల్లిదండ్రులు తమ పిల్లలకు అడుగడుగునా దివిటీల వెలుగులై నిలుస్తారు. కష్టం అనే విషాన్ని తాగి ప్రేమామృతాన్ని పంచేది తల్లిదండ్రులని ప్రతి ఒక్కరు తెలుసుకోవాలి. 'నేడు తల్లిదండ్రుల దినోత్సవం' సందర్భంగా కథనం.

– కర్నూలు కల్చరల్

- తల్లిదండ్రులు ప్రత్యక్ష దైవాలు
- పిల్లల కోసమే వారి జీవన సౌఖ్యాలు త్యాగం
- తల్లిదండ్రులకు గుడికట్టించి పూజిస్తున్న కొందరు
- వృద్ధాప్యంలో వదిలేస్తున్న మరి కొందరు
- జిల్లాలో పెరుగుతున్న వృద్ధాశ్రమాలు
- నేడు తల్లిదండ్రుల దినోత్సవం

జన్మనివ్వడంతో పాటు గుణగణాలను వ్యక్తిత్వాన్ని సమాజాన్ని తోబుట్టువుల పంచి ఇచ్చే వారు తల్లిదండ్రులు. చిన్నతనంలో మన అమాయకత్వాన్ని ఆప్యాయంగా చూసుకొని మురిసిపోయే తల్లిదండ్రులను వృద్ధాప్యం వచ్చాక వృద్ధాశ్రమాల్లో చేర్పకుండా వారిని ఆప్యాయంగా చూసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎంత ఎత్తుకు ఎదిగినా తల్లిదండ్రుల ఆలనా పాలనా చూసుకోలేని జీవితం వ్యర్థం. తల్లిదండ్రులను బిడ్డలు వారి ఆర్థిక అవసరాలను తీర్చే సాధనాలుగా చూసే సంస్కృతి ఏర్పడింది. ఆర్థిక స్థితిని బట్టి తల్లిదండ్రులపై ప్రేమ పంచుకోవడమా, తుంచుకోవడమా అనే విధంగా నేడు కొందరు ప్రవర్తిస్తున్నారు. ఇది చాలా బాధాకరమైన విషయమని పెద్దలు వాపోతున్నారు. చిన్నప్పటి నుంచి కుటుంబ విలువల గురించి నూరిపోస్తే అమ్మానాన్నలను వృద్ధాశ్రమాల్లో చేర్చే పరిస్థితి రాదని చెబుతున్నారు. తల్లిదండ్రుల గొప్పతనాన్ని, త్యాగాన్ని తెలుసుకున్న సంతానం కొందరు అమ్మ నాన్నలను దేవుళ్లుగా భావించి గుళ్లు కట్టించి వారి రుణం తీర్చుకుంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు. తల్లిదండ్రులను కేవలం ఆర్థిక వనరులుగా భావించే వారు వారి ఆలనా పాలనా పట్టించుకోకుండా తాను, తన భార్య, పిల్లలు అనే స్వార్థంతో జీవిస్తూ అమ్మానాన్నలను వృద్ధాశ్రమాలకు చిరునామాలుగా మారుస్తున్నారు. జీవిత చరమాంకంలో తమకు ఇలాంటి దుస్థితి దాపురిస్తుందనే ఇంగితాన్ని కూడా మరిచిపోయి బతుకుతున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో సుమారు 55 వృద్ధాశ్రమాలు ఉన్నాయి. వీటిల్లో 600 మంది వరకు వృద్ధులు ఉన్నారు. వీరు సగానికిపైగా తమ సంతానం ఉండి కూడా అనాథల్లా తమ జీవన చరమాంకంలో బిక్కు బిక్కు మంటూ కాలం వెల్లదీస్తున్నారు.

పిల్లలు చేయాల్సినవి...

- ఇబ్బందులు, సమస్యలు, కష్టాలు, సంతోషాలు అన్నీ తల్లిదండ్రులతో పంచుకోవాలి. జన్మనిచ్చిన తల్లిదండ్రులే అన్ని విషయాలు అర్థం చేకుంటారని గుర్తించుకోవాలి. వారి తరువాతే ఎవరైనా అని భావించాలి.
- తల్లిదండ్రులు ఇచ్చే సలహాలు, సూచనలు, చెప్పే మాటలు అన్నీ తమ మేలుకేనని భావించాలి.
- కౌమారదశలో స్వయం నిర్ణయాధికారం అధికంగా ఉంటుంది. ఆ సమయంలో తల్లిదండ్రులను అత్యంత విశ్వసనీయులుగా లెక్కించాలి.
- పిల్లలు ఎక్కడ దారి తప్పుతారో అన్న ఆందోళనలో తల్లిదండ్రులు ఉంటారు. వారిని ద్వేషించకుండా వారి నమ్మకం పొందాలి.
- తల్లిదండ్రుల వద్ద రహస్యాలు దాచకుండా కుటుంబ స్థితిని గుర్తించి దానికి అనుగుణంగా నడుచుకోవాలి. ఆర్థిక స్థాయిన బట్టి కోరికలను నియంత్రించుకోవాలి.
- విలువలు తగ్గిపోతున్న నేటి సమాజంలో యువత ఇంటి నుంచే మంచి పౌరులుగా ఎదగాలంటే సమష్టి కృషి అవసరం.
- పెద్దలతో ఆప్యాయంగా మాట్లాడాలి. వారు చెబుతున్నది ఓపికగా వినాలి. కష్టసుఖాలు, ఆరోగ్య పరిస్థితులు తెలుసుకోవాలి.

కృతజ్ఞతా భావం కలిగి ఉండాలి



'అమ్మంటే ఆది గురువు. నాన్నంటే నడిపించే దైవం'. తల్లి దండ్రులు తమ పిల్లల పెంపకం విషయంలో చాలా కష్టపడతారు. ఎన్నో త్యాగాలు చేస్తారు. తల్లిదండ్రులు ప్రత్యక్ష దేవతలుగా అందరికి కనబడుతూ వారి ప్రేమానురాగాలను అందిస్తూ బిడ్డల కష్ట నష్టాలను గ్రహిస్తూ అత్యంత బాధ్యత కలిగిన వారిగా కాపాడతారు. ఇవన్నీ పిల్లలు గ్రహించాలి. పరమ పూజ్యనీయులైన తల్లిదండ్రులపట్ల ప్రతి ఒక్కరు కృతజ్ఞతా భావం కలిగి ఉండాలి.

– పద్మావతి, సంస్కృత ఉపాధ్యాయురాలు, కర్నూలు

పవిత్ర మూర్తులు అమ్మనాన్నలు



ప్రతిఫలాపేక్ష లేని పవిత్ర మూర్తులు అమ్మానాన్నలు. తమ జీవితాన్నంతటినీ ధార పోసి తమ సంతాన ఉన్నతికి పాటు పడితే ఆ సంతానం తల్లిదండ్రుల జీవిత చరమాంకంలో వారిని పట్టించుకోకుండా అనాథలుగా చేస్తున్నారు. వృద్ధాశ్రమాలను నివాసాలుగా మారుస్తున్నారు. ఇది ఎంత వరకు సమంజసమో ప్రతి ఒక్కరూ ఆలోచించుకోవాలి. అమ్మ నాన్నల బాగోగులు పట్టించుకోకుండా గుళ్లు గోపురాలు తిరిగినా ఎలాంటి ప్రయోజనం ఉండదని ప్రతి ఒక్కరు గ్రహించాలి.

– రమాజ్యోతి, ప్రధానోపాధ్యాయురాలు,కర్నూలు

ఆర్థిక బంధాలతో కుటుంబాలు విచ్ఛిన్నం



తల్లిదండ్రులు తమ తప్పులను ఎత్తి చూపుతున్నప్పుడు వాటిని తమ బాగు కోసమే అని పిల్లలు గుర్తించాలి. తమ కంటే తల్లిదండ్రులకు ఏదీ ఎక్కువ కాదని పిల్లలు గుర్తించినప్పుడు తాము అడిగింది ఎందుకు ఇవ్వ రో అర్థమవుతుంది. పిల్లలు తల్లిదండ్రులతో ప్రేమ, ఆప్యాయత పంచుకోవాలి. తల్లిదండ్రులకు బిడ్డలకు మధ్య బంధం ఆర్థిక బంధమైతే ఆ కుటుంబం,ఆబంధం ఎప్పటికైనా విచ్ఛిన్నం కాక తప్పదు.

– పి.రవికుమార్, ప్రధానోపాధ్యాయులు, జెడ్పీహెచ్ఎస్, వీపనగండ్ల

మార్కెట్‌లో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు

కర్నూలు(అగ్రికల్చర్): ఆంధ్రప్రదేశ్ హై కోర్టు ఆదేశాల మేరకు రెవెన్యూ కాలనీ, రైతుల మధ్య నెలకొన్న ట్రాఫిక్ సమస్యలపై తగిన చర్యలు తీసుకుంటున్నట్లుగా కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రటరీ ఆర్.జయలక్ష్మి తెలిపారు. రెవెన్యూ కాలనీలో ఉత్తరం దారిగా కూరగాయల మార్కెట్ యార్డుకు వెళ్లే భారీ వాహనాల రాకపోకలపై నివాసితుల అభ్యంతరాలు ఉన్నాయని తెలిపారు. హైకోర్టు ఆదేశాల మేరకు అభ్యంతరాలను పరిశీలించేందుకు జిల్లా కలెక్టర్, ఎస్పీ, మున్సిపల్ కమిషనర్, జేసీ, ఆర్‌బీవోలు, మార్కెట్ కమిటీ అధికారులు, రెవెన్యూ కాలనీ వెల్ఫేర్ అసోషియేషన్ ప్రతినిధులతో కలసి త్వరలోనే సంయుక్త సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వాస్తవ పరిస్థితుల ఆధారంగా ప్రజా ప్రయోజనం, రహదారి భద్రత, రైతుల అవసరాలు, మార్కెట్ కమిటీ పనితీరును సమన్వయం చేసి శాశ్వతంగా సమస్యను పరిష్కరించే మార్గాలపై అన్వేషించనున్నట్లుగా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమస్య పరిష్కారానికి అన్ని వర్గాల సహకారాన్ని కోరుతున్నట్లు తెలిపారు.

స్మార్ట్ మీటర్లు బిగించొద్దు

కోడుమూరు రూరల్: ప్రజలకు భారంగా మారిన స్మార్ట్ మీటర్ల బిగింపును ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి రాజు డిమాండ్ చేశారు. ఈ అంశంపై శనివారం కోడుమూరులోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ప్రజా సంఘాల నాయకులతో కలిసి సీపీఐ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలపై మోయలేని విధంగా చార్జీల భారం వేస్తుందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగులగొట్టండన్న టీడీపీ నాయకులు, నేడు చేస్తున్నదేమిటని ప్రశ్నించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని వారు విద్యుత్ సిబ్బందికి అందజేశారు.

మ్యుటేషన్ విధానాన్ని పకడ్బందీగా నిర్వహించండి


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ

కర్నూలు (టౌన్): రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన ఆటో మ్యుటేషన్ విధానాన్ని సచివాలయాల అడ్మిన్లు పకడ్బందీగా నిర్వహించాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ అన్నారు. శనివారం స్థానిక స్టేట్‌బ్యాంకు కాలనీలోని నగరపాలక సంస్థ నూతన కౌన్సిల్ హాలులో మ్యుటేషన్ విధానంపై రెవెన్యూ విభాగం అధికారులు, సిబ్బంది, సచివాలయాల అడ్మిన్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. మున్సిపల్ సేవల్లో పారదర్శకత పెంచేందుకు వచ్చే నెల 1వ తేదీ నుంచి ఆటో మ్యుటేషన్ ప్రక్రియను సరికొత్త విధానంలో అమల్లోకి తీసుకు వస్తుందన్నారు. ఇళ్లు, ప్లాట్ల రిజిస్ట్రేషన్, ఆన్‌లైన్ విధానంలో ఆటో మ్యుటేషన్ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ రెడ్డి పాల్గొన్నారు.

తాగునీటి సమస్య ఉత్పన్నం కావొద్దు

నగరంలో తాగునీటి సమస్యలు ఉత్పన్నం రాకుండా మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు, సచివాలయాల ఎమీనిటీస్ అవసరమైన చర్యలు చేపట్టాలని నగరపాలక అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ ఆదేశించారు. శనివారం డిప్యూటీ కమిషనర్ సతీష్ రెడ్డితో కలిసి ఆయన స్థానిక అశోక్‌నగర్‌లో ఉన్న నీటి శుద్ధి కేంద్రాన్ని పరిశీలించారు. మెయిన్ పైపులైన్ మరమ్మతుల కారణంగా నీటి సరఫరా జాప్యమవుతున్న కాలనీకు ట్యాంకర్లను పంపించాలని అధికారులకు సూచించారు.

శ్రమదానం

కర్నూలు (అర్బన్): నగరంలోని కిసాన్ ఘాట్ మీదుగా బస్టాండ్ వెళ్లే రోడ్డు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పాడైపోవడంతో శ్రీను కర్రస్వామి అకాడమి సామాజిక సేవ సభ్యులు శనివారం స్వచ్ఛందంగా రోడ్డును శుభ్రపరిచారు. ఇసుక, కంకర, జేసీబీతో రోడ్డును చక్కగా తీర్చిదిద్దారు. కార్యక్రమంలో అకాడమి సభ్యులు ఐ.శ్రీనివాసులు, జి.యుగంధర్, వెంకటసాయి, ఆజాద్, ప్రభాకర్, రాము నాయక్, రియాజ్, అభిరామ్, రమేష్ పాల్గొన్నారు.

పొగాకు రైతు సమస్యలను పరిష్కరించాలి

- రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి డిమాండ్


సమావేశంలో మాట్లాడుతున్న కె.ప్రభాకరరెడ్డి

కర్నూలు(సెంట్రల్): తక్షణమే పొగాకు రైతు సమస్యలను పరిష్కరించాలని ఏపీ రైతు సంఘంరాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి డిమాండ్ చేశారు. క్వింటా పొగాకును రూ. 15 వేలకు కొనుగోలు చేయాల్సిన వ్యాపారులు కేవలం రూ. 1000-2000లకు అడుగుతుండటం దారుణమన్నారు. శనివారం కార్మిక, కర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పొగాకు రైతుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం దారుణంగా వ్యవహరిస్తోందన్నారు. రెండేళ్ల క్రితం పొగాకు క్వింటా అధికంగా రూ.15 వేలకు అమ్ముడుకావడంతో ఎక్కువ మంది పంటను పండించారన్నారు. ఈక్రమంలో గతేడాది ఖరీఫ్‌లో పండిన పంటను వ్యాపారులు కేవలం రూ.10 వేల లోపే కొనుగోలు చేయడంతో అన్నదాతలు ఆందోళనలు చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఇటీవల మొత్తం పొగాకును కొనుగోలు చేయించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి అచ్చెన్నాయుడు చెప్పినా ఎక్కడా కొనుగోలు చేయడం లేదన్నారు. కేవలం రూ.2వేల లోపే ధరకు అడుగుతుండడంతో అన్నదాతలు తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. సమావేశంలో ఏపీ రైతుసంఘం నాయకుడు రామకృష్ణ పాల్గొన్నారు.

మునిసిపల్ పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించండి


నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాలను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): నగరంలోని మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు పి.నిర్మల, కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సీపీఎం బృందం నగరంలోని నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాలను సందర్శించి అక్కడి సమస్యలు తెలుసుకున్నారు. పీఈటీ, హిందీ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. కనీసం లైబ్రరీ కూడా లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, పాఠశాల కంపౌండ్‌లోనే సచివాలయం ఉండడంతో వచ్చే పోయే వారితో ఇబ్బంది ఉన్నట్లు చెప్పారు. సచివాలయాన్ని వేరే ప్రాంతానికి తరలించాలని డిమాండ్ చేశారు. మునిసిపల్ ఉన్నత పాఠశాలల్లో తక్షణమే ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలన్నారు. వాష్ రూమ్‌లను ఏర్పాటు చేయాలని, నీటి సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎం.రాశేఖర్, ఎస్ఎండీ షరీఫ్ పాల్గొన్నారు.

ఘనంగా ల్యాంప్ లైటింగ్ ఉత్సవం


జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ అర్చన

కర్నూలు (హాస్పిటల్) : నగర శివారులోని కళాంజలి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (కిమ్స్) నర్సింగ్ కళాశాలలో శనివారం ల్యాంప్ లైటింగ్ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. 2024-25 బ్యాచ్ బీఎస్సీ నర్సింగ్ విద్యార్థులకు నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ అర్చన, గీతాంజలి నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వసంత కుమారి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నర్సింగ్ అంటేనే సేవాభావంతో కూడుకున్న కోర్సు అని, ఈ కోర్సుకు ప్రపంచ వ్యాప్తంగా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. క్లినికల్ ట్రైనింగ్ సమయంలో విద్యార్థులు మంచి ప్రవర్తన కలిగి రోగులను తల్లిదండ్రులా చూసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థినీ, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో అధ్యాపకులు షబానా, కోమలి, శారద తదితరులు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన


మహిళా చట్టాలపై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న పోలీసు అధికారి

కర్నూలు: మహిళా చట్టాలు, ఫోక్సో కేసులు, విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నియంత్రణ, మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు, ఈవ్‌టీజింగ్ తదితర సమస్యలపై శక్తి టీమ్స్ మహిళల్లో చైతన్యం తెచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఆ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం పోలీసు అధికారులు, శక్తి టీమ్ బృందాలు జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. శక్తి యాప్, శక్తి వాట్సాప్ 7993485111, ట్రాఫిక్ నిబంధనలు, డయల్ 100/112 సేవలపై అవగాహన కల్పించారు. సమాజంలో ఆడ పిల్లలు, మహిళలు, యువత ఎదుర్కొంటున్న సవాళ్లపై సదస్సుల్లో చర్చించి బంగారు భవిష్యత్తు కోసం ఏ విధంగా ప్రవర్తించాలనే అంశాల గురించి అవగాహన కల్పించారు. సైబర్ నేరాల విషయంలో ఏపీకే ఫైల్స్, ఫేక్ ఎస్ఎంఎస్‌లు, ఓటీపీ మోసాలు, బ్యాంకు పేరుతో వచ్చే ఫోన్ కాల్స్, వాట్సాప్ ఫేక్ లింకులు, ఫేక్ లోన్ యాప్స్, కేవైసీ మోసాలు, డిజిటల్ అరెస్ట్, ఈ-చలానా పేరుతో మోసాలు తదితర వాటి గురించి విద్యార్థులకు వివరిస్తూ అవగాహన కల్పించారు. పాఠశాలలు, కళాశాలల పరిసరాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేసినట్లు కూడా వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో 100/112కి కాల్ చేసి పోలీసుల సహాయం పొందవచ్చని సూచించారు.

కార్గిల్ విజయ్ దివస్ విజయోత్సవ ర్యాలీ


కలెక్టరేట్ ఎదుట కాగడాల ప్రదర్శన నిర్వహిస్తున్న ఏబీవీపీ విద్యార్థులు

కర్నూలు (సెంట్రల్): అఖిల భారత విద్యార్థి సమాఖ్య నగర శాఖ ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్ విజయోత్సవ ర్యాలీని నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శి వెంకట గోపి ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీ స్థానిక విశ్వేశ్వరయ్య సర్కిల్ నుంచి ప్రారంభమై వినాయక ఘాట్ మీదుగా కలెక్టరేట్ వరకు కొనసాగింది. ఇక్కడ కార్గిల్ యుద్ధ వీరులకు దివిటీలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో విభాగ్ ప్రముఖ్ నాగఫణి శాస్త్రి పాల్గొన్నారు.

అనాథలకు ఆధార్ కార్డు ఇప్పించండి


సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీఓ శారద

కర్నూలు (న్యూటౌన్): అనాథలను గుర్తించి ఆధార్ కార్డును ఇప్పించడం అందరి బాధ్యత అని శిశు సంక్షేమ శాఖ డీసీపీఓ శారద అన్నారు. శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో శనివారం బంగారుపేటలో నిర్వహించిన సమావేశంలో డీసీపీఓ శారద, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కమిటీ సభ్యులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్య, వైద్యం, పునరావాసం, షెల్టర్ హోమ్‌లలో ప్రవేశం, సంక్షేమ పథకాలు పొందాలంటే ఆధార్ తప్పనిసరి అన్నారు. డిప్యూటీ తహసీల్దార్ రవిచంద్ర మాట్లాడుతూ వీలైనంత త్వరగా ఆధార్ గుర్తింపునిచ్చేందుకు ప్రయత్నిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సూపరింటెండెంట్ రాజశేఖర్, అడ్వకేట్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పెద్దాసుపత్రిలో రూ.14 కోట్లతో విశ్రాంతి భవనం

- ముందుకొచ్చిన పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రోగుల సహాయకుల అవసరాల నిమిత్తం రూ.14.15 కోట్లతో విశ్రాంతి భవనం నిర్మించనున్నారు. ఇందుకు సీఎస్ఆర్ కింద సహకారం అందించేందుకు సికింద్రాబాద్ కేంద్రంగా పనిచేసే పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (పీజీసీఐ) ముందుకొచ్చింది. ఈ ప్రతిపాదనను వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆమోదించారు. విశ్రామ్ సదన్ పేరుతో నిర్మితమయ్యే ఈ భవనంలో రోగుల సహాయకుల కోసం మొత్తం 150 పడకలు ఏర్పాటు చేయనున్నారు. ఇందులో ఆఫీస్ కార్యాలయం, రిక్రియేషన్ వసతులు, పంప్‌హౌస్, ఓవర్‌హెడ్ నీటి ట్యాంక్, జనరేటర్, సోలార్ రూఫ్‌టాప్‌లు ఉంటాయి. ఎలాంటి లాభాపేక్ష లేకుండా వినియోగదారుల నుంచి స్వల్ప రుసుం వసూలు చేసి భవనాన్ని నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్ ఎంపిక చేసిన స్వచ్ఛంద సంస్థకు ఈ భవనాన్ని అప్పగిస్తారు. కాగా ఆసుపత్రి ఎదురుగా శాలమ్మ సత్రం పేరుతో ఇప్పటికే రోగుల విశ్రాంతి భవనం ఉంది. అందులోనూ నామమాత్ర ఫీజుతో రోగుల సహాయకులకు విశ్రాంతి పొందేందుకు అవకాశం కల్పించాల్సి ఉంది. కానీ పూర్తిస్థాయిలో ఇది అమలు కావడం లేదన్న విమర్శలున్నాయి. నిత్యం దాదాపుగా అన్ని గదులూ ఖాళీగా ఉంటున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. రోగుల సహాయకుల కోసం ఇక్కడ ఒక విశ్రాంతి భవనం ఉందన్న విషయం కూడా చాలా మందికి తెలియని పరిస్థితి నెలకొంది.

మా డిపాజిట్లు ఎప్పుడు ఇస్తారు?

- కర్నూలు అర్బన్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ జనరల్ బాడీ సమావేశంలో సభ్యుల ఆందోళన


విచారణ నివేదికలోని అంశాలను సభ్యులకు వివరిస్తున్న అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీ చైర్మన్ నాగరమణయ్య

కర్నూలు(అగ్రికల్చర్): 'రేయింబవళ్లు కష్టం చేసిన సొమ్ములో అవసరాల కోసం కొంత డబ్బును కర్నూలు అర్బన్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ'లో డిపాజిట్‌గా పెట్టాం. మేము పొదుపు చేసిన డబ్బు సంగతేమిటీ.. మాకు ఎప్పుడు తిరిగి ఇస్తారు?' అని పలువురు సంఘం సభ్యులు వాపోయారు. సొసైటీలో జరిగిన అక్రమాలపై సెక్షన్ 51 విచారణ నివేదిక అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీకి అందిన నేపథ్యంలో శనివారం సొసైటీ ప్రాంగణంలోనే జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొందరు సభ్యులు అక్కడికి చేరుకుని తమ బాధను వ్యక్తం చేశారు. 'సొసైటీపై నమ్మకంతో దాచుకున్న డబ్బులను డిపాజిట్‌లుగా పెట్టాం.. మా డబ్బులు దుర్వినియోగమైతే మా పరిస్థితి ఏమిటీ' అంటూ ప్రశ్నించారు. దుర్వినియోగం చేసిన వారు బాగా ఉన్నారని తాము నష్టపోయామని ఆందోళన వ్యక్తం చేశారు. పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీ చైర్మన్ నాగరమణయ్య మాట్లాడుతూ.. విచారణ నివేదికలోని విషయాలను సభ్యులకు వివరించారు. నివేదికలో బాలరాజు, జాకీర్, రఫీక్ పేర్లు ఉన్నాయని, మొత్తం రూ.2.42 కోట్లు దుర్వినియోగం అయినట్లు తేలిందని తెలిపారు. కర్నూలు డివిజన్ సహకార అధికారి నిధుల దుర్వినియోగంపై మరోసారి విచారణ జరిపి సర్‌చార్జ్ ఉత్తర్వులు జారీ చేస్తారని పేర్కొన్నారు. సొసైటీలో వివిధ రూపాల్లో డిపాజిట్ చేసిన వారందరికీ న్యాయం చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని కమిటీ చైర్మన్ నాగరమణయ్య తెలిపారు. దుర్వినియోగమైన నిధులను రికవరీ చేసేందుకు సహకార చట్టంలో అనేక మార్గాలు ఉన్నాయని, ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. కార్యక్రమంలో పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీ సభ్యులు జి.రామకృష్ణయ్య, ఎస్.మున్వర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

మచ్చలేని నాయకుడు శిఖామణి


శిఖామణికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ సమన్వయ కర్త కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మణిగాంధీ

కర్నూలు(రూరల్): కోడుమూరు మాజీ ఎమ్మెల్యే శిఖామణి మచ్చలేని నాయకుడు అని వైఎస్సార్ సీపీ కోడుమూరు నియోజక వర్గ సమన్వయ కర్త కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం శిఖామణి 17 వ వర్ధంతిని పురస్కరించుకుని మునగాలపాడు సమీపంలోని ఘాట్‌లో పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కోట్లహర్ష మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి కృషి చేసిన నాయకుడు శిఖామణి అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మణిగాంధీ, వారి కుటుంబ సభ్యులు, వైస్సార్ సీపీ మండల కన్వీనరు పెరపోగు మోహన్ బాబు, గూడూరు మునిస్పల్ చైర్మన్ జులపాల వెంకటేశ్వర్లు మాజీ జెడ్పీటీసి వెంకటేశ్వర్లు, పోలకల్ ప్రభాకరు రెడ్డి , కోడుమూరు, గూడూరు, సి.బెళగల్, కర్నూలు మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులు , కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.